ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వాట్సాప్ సేవలను అందిస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం రేపు పలు ప్రధాన బిల్లులను ప్రవేశపెట్టనుంది.
- సంక్రాంతి నాటికి రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి కొనసాగుతోందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

===================

రైతుల సమయం వృథా కాకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం వాట్సాప్ ద్వారా సేవలు అందిస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం అమ్మదలచిన రైతులు 73373-59375 నెంబర్ కు Hi అని సందేశం పంపగానే సేవల వినియోగంపై మార్గదర్శకం చేస్తుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం తరహాలో ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ ఫార్మర్ సేవలు అందిస్తోందని అన్నారు. రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో సాంకేతికత వినియోగించి ధాన్యం కొనుగోలు సరళతరం చేశామని, ఈ సేవలు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

===================

శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వం రేపు పలు ప్రధాన బిల్లులను ప్రవేశపెట్టనుంది. పంచాయతీ రాజ్ బిల్లును ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రవేశపెడతారు. దీనితో పాటు ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణల నిరోధక బిల్లు, ఆంధ్ర ప్రదేశ్ కో-ఆపరేటివ్ సొసైటీ బిల్లు, మునిసిపల్ లా బిల్లు, డాక్టర్ ఎన్.టి.ఆర్. ఆరోగ్య విశ్వవిద్యాలయానికి సంబంధించిన బిల్లులను కూడా సంబంధిత మంత్రులు శాసన సభలో ప్రవేశ పెట్టనున్నారు.

===================

సంక్రాంతి నాటికి రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో 4 వేల 500 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడతామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక పరిపుష్టి పెంచిందని అన్నారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొంటూ..

బైట్ .. నిమ్మల రామానాయుడు (37 సెకన్లు)

===================

నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి కొనసాగుతోందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రానున్న 24 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వానలు పడతాయని పేర్కొంది. మరోవైపు ఆంధ్ర ప్రదేశ్, యానాంలో ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయని తెలిపింది.

===================

విరామం

===================

తిరుపతి జిల్లా చంద్రగిరి మాజీ శాసన సభ్యులు నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు అతని స్వగ్రామమైన నారావారిపల్లెలో ఈరోజు మధ్యాహ్నం ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. అనారోగ్య కారణాలతో నారా రామ్మూర్తి నాయుడు నిన్న హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. ఈరోజు ఉదయం ప్రత్యేక విమానంలో పార్థివదేహాన్ని తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు స్వగ్రామంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. తన సోదరుని అంత్యక్రియల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తదితరులు హాజరయ్యారు. మహారాష్ట్ర గవర్నర్ రాధాక్రిష్ణన్

రామ్మూర్తి నాయుడు పార్ధీవ దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. తల్లిదండ్రులు ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మ సమాధుల పక్కనే రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు పూర్తి చేశారు.

==================

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా దీక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహాలక్ష్మి గణేష్ చెప్పారు. భీమవరంలో ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ, ఈనెల 21వ తేదీన జ్యోతి ఊరేగింపు, 23వ తేదీన అమ్మవారికి సారె సమర్పణ, 24న అమ్మవారికి దీక్షా దారులతో పడి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25వ తేదీన దీపోత్సవం, 27న నెయ్యి అభిషేకం నిర్వహిస్తామని ఆయన వివరిస్తూ..

బైట్.. మహాలక్ష్మి గణేష్ (23 సెకన్లు)

==================

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలను సక్రమంగా అమలు చేయాలని అనంతపురం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఈరోజు ఆయన అనంతపురం పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం రాయలసీమను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాయలసీమకు నీటి ప్రాజెక్టులు మంజూరు చేసి సీమ రైతులను ఆదుకోవాలని వెంకటరామిరెడ్డి కోరారు.

==================

ఏలూరు ప్రాంతంలో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అక్రమ రవాణా చేస్తున్న 1.24 లక్షల విలువైన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పట్టించే వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.

==================

పవిత్ర కార్తీకమాసంలో నిర్వహించే కార్తీక వన భోజన మహోత్సవంలో భాగంగా ఈరోజు తిరుమల వైభవోత్సవ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి స్నపన తిరుమంజనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ మలయప్ప స్వామివారిని, ఉభయనాంచారులను ఊరేగింపుగా వైభవోత్సవ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనములతో విశేషంగా అభిషేకం చేశారు.

==================

==================